క్లుప్తంగా

బ్రాహ్మణులకు సన్మానం



వనపర్తి టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో వెంకటయ్య అధ్యక్షతన బ్రాహ్మణులు నాయకంటి నరసింహాశర్మ, లక్ష్మీ నారాయణ చార్యులు, మధుసూదన్ శర్మ, శ్యామ్ సుందర్ శర్మలను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు క్రోధి నామ సంవత్సరం పంచాంగాన్ని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు శేఖర్, డైరెక్టర్ కురుమూర్తి, సభ్యులు తిరుపతయ్య, శాంతమ్మ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, ప్రమోద్, రామచంద్రారెడ్డి, రత్న శేఖర్‌రెడ్డి, విజయ్ కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనల తనిఖీలు



అమరచింత: పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో బుధవారం వాహనాల తనిఖీలను ముమ్మరంగా నిర్వహించి నాకబందితో అవగాహన కల్పించామని ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తనిఖీలు చేస్తున్నామని, డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు, వాహనాలకు సంబంధించిన ఆర్‌సీలను పరిశీలిస్తున్నామన్నారు. అక్రమంగా నగదును తరలిస్తే స్వాధీనం చేసుకోవడంతో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రూ.50 వేల నగదు కంటే ఎక్కువగా తరలిస్తే వీటికి సంబంధించిన ఆధారాలు ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అదే విధంగా తాగి వాహనాలను నడపొద్దని, డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అమరచింత: బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కల నరసింహులుగౌడ్ మాతృమూర్తి వెంకటేశ్వరమ్మ మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్ సింగ్, బాలరాజు, కమలాకర్‌గౌడ్, నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.


కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని 10వ వార్డుకు చెందిన బోయ బిచ్చినాయుడు(58) అనారోగ్యంతో సోమవారం రాత్రి మరణించారు. మంగళవారం బిచ్చినాయుడు మృతదేహానికి మాజీ మార్కెట్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కట్టా శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి వెంట రైతు సంఘం నాయకులు బరిగెల సత్యనారాయణయాదవ్, కాంగ్రెస్ నాయకులు ప్రసాద్‌నాయుడు ఉన్నారు.

గుండెపోటుతో అర్చకుడు మృతి



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని శివాలయం వీధికి చెందిన వంశీకృష్ణ చార్యులు(35) గుండెపోటుతో మృతి చెందాడు. వంశీకృష్ణచార్యులు మంగయ్య గుడి ఆంజనేయస్వామి ఆలయంలో కొంత కాలంగా అర్చకుడి పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి గదిలో నిద్రించిన ఆయన ఉదయం 7గంటలైనా బయటకు రాకపోవడంతో అతడి అన్న నర్సింహాచార్యులు గది తెరిచి చూడగా మృతి చెంది కనిపించాడు. ఏడాది క్రితం ఇతడి తండ్రి రంగాచార్యులు మృతి చెందాడు. ఏడాదిలో ఒకే ఇంట్లో ఇద్దరు మృతి చెందడంతో ఆ కుటుంబంలో, కాలనీలో విషాదచాయలు అలముకున్నాయి. సాంప్రదాయ పద్ధతిలో బుధవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



ఆత్మకూర్: మండలంలోని రేచింతలలో ఉగాది సందర్భంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మొత్తం 15 జట్లు తలపడగా.. విజేతగా నిలిచిన ఎస్ఎస్ ఈగల్ జట్టుకు రూ.15వేలు నగదు, షీల్డు, రెండో బహుమతి గెలుపొందిన వారియర్ టీంకు రూ.10వేలు నగదు, షీల్డులను మాజీసర్పంచ్ సరోజ రాఘవేందర్, ఎంపీటీసీ అలివేలుబీసన్న అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రావణ్‌రెడ్డి, శశిధర్ రెడ్డి, రాజు, మహేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, భాస్కర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నీటి వృథా.. పట్టింపేది?



రాయినిపల్లి శివారులో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



కనిమెట్టలోని 7వ వార్డులో..

- మరమ్మతులు చేపట్టని అధికారులు
- తాగునీటికి ఇబ్బందులు
- లీకేజీల ద్వారా ఫైప్‌లైన్‌లోకి మురుగు

కొత్తకోట రూరల్: వేసవి ఎండలు రోజు రోజుకూ పెరుగుతుండడంతో గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాలు ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు భగీరథ పైప్‌లైన్ల లీకేజీలతో తాగునీరు వృథాగా పోతుంది. అయినా అధికారులు ఇవేవి పట్టించుకోకుండా పైపులైన్లకు మరమ్మతు చేయించేందుకు అలసత్వం వహిస్తున్నారు. మండలంలోని కనిమెట్ట గ్రామంలోని 7వ వార్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ వల్ల నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రత్యేక అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ కింది స్థాయి అధికార యంత్రాంగం మాత్రం తమకేమీ పట్టనట్టుగా ఉండిపోతున్నారు. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీళ్ల వృథా పోతున్నా మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడంతో వారి పనితీరుపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ లీకేజీ వద్ద మురుగు నీరు పైప్‌లైన్‌లోకి చేరి నీరంతా కలుషితం అయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామంలో పైపులైన్ లీకేజీలను అరికట్టి గ్రామస్తులకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు గ్రామస్తులు వేడుకుంటున్నారు.

మరమ్మతు చేపట్టాలి

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ కొన్ని నెలలుగా లీకేజీ అవుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో నీరు వృథా కావడంతో పాటు తాగునీరు కలుషితం అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఒకపక్క ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరుబావుల నుంచి నీరు సక్రమంగా రాక తాగునీటికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఇలా నీరు వృథా అవుతున్న పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి లీకేజీలకు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



గురిగింజమిట్టతండాలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: వడదెబ్బ తగలకుండా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలు తప్పక పాటించాలని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని కదిరెపాడు, గన్యానాయక్‌తండా, గురిగింజమిట్టతండాల్లో ఆయన వైద్య సిబ్బందితో కలిసి పర్యటించి వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంపిణీ చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఒక లీటర్ నీటిలో కలుపుకొని తాగాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున బయటికి వెళ్లొద్దని, అత్యవసర సమయంలో బయటికి వెళితే టోపి, గొడుగు, రుమాలు తప్పక ధరించాలన్నారు. ఎక్కువ నీళ్లు తాగుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధి కూలీలు ఉదయం వేళల్లో తొందరగా వెళ్లి పనులు ముగించుకుంటే మధ్యాహ్నం సమయంలో తొందరగా వెళ్లేందుకు వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుమిత్ర, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

ఖిల్లాఘనపురం: జిల్లాలో బీఎస్పీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జ్ మొల్గర తిరుమలేష్ అన్నారు. జిల్లా బీఎస్పీ ఇన్‌చార్జ్‌గా ఖిల్లాఘనపురం మండలం తిర్మలాయపల్లికి చెందిన మొల్గర తిరుమలేష్‌ను నియమిస్తూ బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ జూమ్‌మీటింగ్ ద్వారా ప్రకటించారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ పదేళ్లుగా పార్టీలో నిబద్ధతతో ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం పని చేసినందుకు తనను నమ్మి ఈ అవకాశాన్ని ఇచ్చారని తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెడుతూ పార్టీని జిల్లా లో బలోపేతం చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పందులను తరలించండి

ఎర్రవల్లిచౌరస్తా: మండల కేంద్రంలో ఇండ్లమధ్యనే పెంపకందారులు పందులను విచ్చలవిడిగా పెంచడం వల్ల నిత్యం ఇళ్ల చుట్టూ స్వైరవిహారం చేస్తున్నాయని, మురుగు పెరిగి రోగాల బారిన పడుతున్నామని ఎర్రవల్లి చౌరస్తా వాసులు వాపోతున్నారు. గ్రామంలో పందుల సమస్యను పరిష్కరించాలని పలుమార్లు స్థానిక అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల వల్ల గ్రామంలో మురుగు పెరిగి నిత్యం కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోందని పేర్కొన్నారు. దీనివల్ల ఏ రోగం ముంచుకొస్తుందోనని నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని పందులను దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'నాణ్యత లేని మాంసం విక్రయిస్తే చర్యలు'



మాంసం విక్రయ కేంద్రాల వద్ద తనిఖీలు చేస్తున్న ఉమామహేశ్వర్‌రెడ్డి

వనపర్తి టౌన్: మాంసం విక్రయాల పేరుతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే సహించమని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. ఉగాది పండుగ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో మాంసం విక్రయాలు జోరుగా సాగుతుండటంతో ఉదయం 6 గంటల నుంచి మున్సిపల్ జవాన్లతో కలిసి మాంసం విక్రయ కేంద్రాలు, జంతు వధ శాఖలలో జీవాలను వధిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మర్రికుంట రహదారి, మారెమ్మకుంట టర్నింగ్ వద్ద, గాంధీచౌక్, పాతబజార్‌లో విక్రయ కేంద్రాల్లో మాంసం నాణ్యతను పరిశీలించారు. మర్రికుంట సమీపంలో పలు చోట్ల అనారోగ్యంతో ఉన్న జీవాలను వధించడంతో వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటుగా ఆరోగ్యకరమైనవి ఎలా గుర్తించాలో ప్రజలకు ప్రత్యక్షంగా చూయించారు. మాంసం కొనేటప్పుడు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, క్షుణ్ణంగా పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. మర్రికుంటలోని మరో వ్యాపారి ఆరోగ్యకరంగా వధించిన జీవి మాంసాన్ని, అనారోగ్యకరమైన మాంసాన్ని రెండింటిని కలిపి విక్రయించడంపై ఆయన మండిపడ్డారు. వ్యాపారులను రెడ్ అలర్ట్‌లో ఉంచుకొని, మరోసారి తప్పు జరిగితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో పాటు ఆ మాంసాన్ని విక్రయించకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పండుగలు, ప్రత్యేక వారాల్లో మాంసం కొనేటప్పుడు ప్రజలు తొందరపడొద్దని, అన్ని రకాలు పరిశీలించాలని సూచించారు. వ్యాపారులు లాభాపేక్ష కోసం ఇష్టానుసారంగా వ్యవహరించి ప్రజల అనారోగ్య సమస్యలకు కారణమైతే ఊరుకోమన్నారు. తూకాల్లో మోసాలు, వ్యత్యాసాలు లేకుండా విక్రయాలు సాగించాలని ఆదేశించారు.

ముస్తాబైన మసీద్‌లు, ఈద్గాలు



అమరచింతలో ఈద్గా వద్ద పారిశుద్ధ్య పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూర్: నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి రంజాన్ మాసంలో నిత్యం ప్రత్యేక నమాజ్‌లు చేసిన ముస్లింలు గురువారం ఈదుల్‌ఫితర్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ పట్టణంలోని, మండలంలోని మసీద్‌లు, ఈద్గాలు అందంగా ముస్తాబయ్యాయి. ఆత్మకూర్‌లోని ఈద్గాకు పురచైర్‌పర్సన్ గాయత్రిరవియాదవ్ రంగులు వేయించి ముస్తాబు చేయించారు.

విద్యుత్ కాంతులతో..

అమరచింత: పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని జామీయా, రహమానీయ మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రతినిత్యం ఐదు పూటల నమాజుకు హాజరవుతున్న వారి కోసం ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలు గురువారం రంజాన్ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి చేసుకోనున్నారు. గురువారం ఈద్గాల వద్ద నిర్వహించే పవిత్ర ఈథుల్‌ఫితర్ నమాజుకు పట్టణంలోని ఈద్గాలను ముస్తాబు చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ముళ్ల పొదలతో పాటు కంపచెట్లను తొలగించారు. ఈద్గాకు సున్నం వేయడంతో పాటు నమాజుకు వచ్చే భక్తుల కోసం షామియానాలను సిద్ధం చేశారు. తాగునీటి వసతితో పాటు ఈద్గా పరిసర ప్రాంతం పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు.



ఆత్మకూర్‌లో..



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

బండలాగుడు పోటీలు ప్రారంభించిన మంత్రి..

చిన్నంబావి: ఉగాదిని పురస్కరించుకొని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తన స్వగ్రామమైన పెద్దదగడలో బుధవారం బండలాగుడు పోటీలు ప్రారంభించి మాట్లాడారు. స్వగ్రామంలో ఉగాది వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో గ్రామ రూపురేఖలు మారబోతున్నాయని.. నియోజకవర్గంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పోటీల్లో మొదటి బహుమతిని చనమోని గంగన్న, రెండో బహుమతి వెంకటస్వామి, మూడో బహుమతి గోద దర్గయ్య ఎద్దులు సాధించగా యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతిచెందిన కనమోని నర్సింహ, గోపాల్‌రెడ్డి, అంబయ్య కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట సురేందర్‌సింగ్, వెంకటేష్, బొల్లు నర్సింహ, గోపాలకృష్ణ, బొల్లు శ్రీనివాసులు, కురుమయ్య, గంగయ్య, నరేష్ కుమార్, శంకర్, యుగంధర్‌గౌడ్, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సమకూర్చండి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు అంబులెన్స్ వసతి కల్పించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల ప్రజలు సకాలంలో వైద్య వసతులు అందక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అంబులెన్స్ వసతి కల్పించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాలకు బస్సు వసతులు లేవని వెంటనే బస్సులు నడపాలని వారు కోరారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే చిన్నంబావి, వీపనగండ్ల మండలాలకు రెండు అంబులెన్స్‌లతో పాటు మండలంలోని గ్రామాలకు బస్సు వసతిని కల్పిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆశన్న, శ్రీనివాసులు, గ్రామస్తులు ఉన్నారు.

బీజేపీ యువ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా రాజు

వనపర్తి టౌన్: భారతీయ జనతా యువ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా ఎద్దు రాజు నియమితుడయ్యాడు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ నియామక పత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎద్దు రాజు మాట్లాడుతూ.. పార్టీ తన నమ్మకం ఉంచి ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని, పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు.

శ్రీరామనవమి వరకు కందూరు జాతర

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జాతర శ్రీరామ నవమి వరకు కొనసాగనుంది. గత నెల 21న మొదలైన స్వామి వారి బ్రహ్మోత్సవాలు అదే నెల 26న ముగిశాయి. అప్పటి నుంచి ఆలయం వద్ద ఉగాది వరకు జాతర నిర్వహించారు. ఉగాది రోజు విశిష్ట పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఇదిలా ఉండగా ఏటా ఉగాది వరకే జాతర సాగేది. అయితే కొన్నేళ్ల నుంచి జాతరను శ్రీరామ నవమి వరకు పొడిగించారు. ఈసారి కూడా జారతను శ్రీరామ నవమి వరకు నిర్వహించనున్నట్లు ఈఓ రాజేశ్వరశర్మ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో జాతరకు రావాలని సూచించారు.

ఇంకుడు గుంతలే ఆధారం

- అడుగంటిన భూగర్భ జలాలు
- నిరుపయోగంగా మారిన గుంతలు
- నిర్వహణ మరిచిన అధికారులు
- పెరుగుతున్న నీటి కొరత



చెన్నిపాడులోని ఓ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడుగుంత(ఫైల్)

మానవపాడు: భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపకరించే ఇంకుడు గుంతల నిర్వహణ మండలంలో మర్చిపోయారు. వాటికోసం తమ వంతు ప్రయత్నం చేయాల్సిన అధికారులు గడిచిన ఏడేళ్లలో ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. వేసవికాలం రాకముందు ఎక్కడెక్కడ ఇంకుడు గుంతలు తవ్వాలో గుర్తించి స్థలాలను ఖరారు చేసేవారు. ఎండాకాలం ప్రారంభం కాగానే ఆయా స్థలాల్లో వాటిని ఏర్పాటు చేసేవారు. వర్షాకాలం నాటికి అవన్నీ సిద్ధంగా ఉండటంతో వర్షపునీరంతా వాటిలోకి వెళ్లి భూగర్భ జలాలు పెరిగేవి. నేడు ఇంకుడు గుంతలు పలు గ్రామాల్లో నిరుపయోగంగా మారి, మరికొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థలోకి చేరాయి.

ఎందుకింత నిర్లక్ష్యం..

గతంలో మండల అధికారులు ఇంకుడు గుంతల ఏర్పాటులో కాలనీవాసులను భాగస్వాములను చేశారు. భూగర్భజలాల సంరక్షణకు కాలనీవాసులు ముందుకొస్తే తాము ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తామని, వాటి సంరక్షణకు ఇంటి వద్ద అయితే ఇంటి యాజమాని, చేతి పంపుల వద్ద మంచినీటి ట్యాంకుల వద్ద అయితే కాలనీ సంఘాలు, ప్రతినిధులు చూడాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇంకుడు గుంతలపై ఆసక్తి ఉన్నవారు నేరుగా ఆయా శాఖలకు దరఖాస్తులు చేసుకుంటే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చేవారు. గతంలో ప్రతి చేతి పంపు వద్ద, బోర్లు, ట్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో అవి పూర్తిగా ధ్వంసం కగా మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లు వేయడంతో చాలా ఇంకుడు గంతలు కనపడకుండా పోయాయి. ఇప్పుడు ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతను ఏర్పాటు చేసే పరిస్థితి లేదు.

గ్రామాల్లో కానరాని ఇంకుడు గుంతలు..

మండలంలో దాదాపు 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 16 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 3000 వేల దాకా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేశారు. గతంలో అధికారుల ఆదేశానుసారం ఇంకుడు గుంతలు తవ్వారు. అవి తూతూ మంత్రంగా తయారయ్యాయి. ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయడంలో పర్యవేక్షణ కొరవడటం, అధికారులు క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో ఇంటికో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని అధికారులు చెబుతున్నా, నేడు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. ఇంటి నిర్మాణం చేపడుతున్నారంటే ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. గ్రామాల్లో సైతం భూగర్భ జలాలు కనపడడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ఇంకుడుగుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి.

ఇంటికో ఇంకుడు గుంత

భూగర్భ జలాలను సంరక్షించడానికి ప్రభుత్వం చేపడుతున్న ఇంకుడుగుంతల నిర్మాణంలో తప్పనిసరిగా ఇంటికో ఇంకుడుగుంత ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయిలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం గాలికొదిలేశారు. ఇంకుడుగుంతల పర్యవేక్షణ కొరవడింది. ఉన్నతాధికారులు చొరవ చూపి ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

– ప్రభాకర్, మానవపాడు

అవగాహన కల్పిస్తున్నాం

ప్రస్తుతం భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతున్న తరుణంలో తప్పనిసరిగా ఇంకుడుగంతలను ఏర్పాటు చేసుకోవాలి. వాటి ఏర్పాటుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాలంటే తప్పనిసరిగా ఇంకుడుగుంతను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఇచ్చాం.

– ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ, మానవపాడు

తహసీల్దార్ ఆఫీసుకొస్తే జర పైలం

- శిథిలావస్థకు చేరిన భవనం
- పైకప్పులో తేలిన ఇనుప చువ్వలు



తహసీల్దార్ కార్యాలయం వెనక భాగంలో శిథిలావస్థకు చేరిన భవనం

మదనాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వస్తే జర పైలంగా ఉండాల్సిన అవసరం ఉంది. జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణ సమయంలో ఆగమేఘాల మీద అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో మదనాపురం మండల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు ప్రారంభించేందుకు భవనాలు లేకపోవడంతో అప్పటికే శిథిలావస్థలో ఉన్న పాత పాఠశాల భవనానికి తుది మెరుగులు దిద్ది పరిపాలన ప్రారంభించారు. పాలన ప్రారంభమై ఆరేళ్లు పూర్తి కావస్తున్నా తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థ భవనంలోనే కొనసాగుతుంది.

సీకులు తేలిన పైకప్పు

తహసీల్దార్ కార్యాలయం సంబంధించి వెనకభాగంలో ఉన్న భవనాలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. పైకప్పు ఊడిపడడంతో సీకులు వేలాడుతున్నాయి. మొన్నటి వర్షాకాలంలో కురిసిన వర్షాలకు భవనాల్లో తుంపులు వచ్చాయి. అప్పుడప్పుడు పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెనక భాగంలో ఉన్న పాత భవనాల వద్దకు వెళ్తున్నారు. ఎప్పుడు కూలి పడుతుందో తెలియని పరిస్థితిలో భవనం ఉండడంతో ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి నూతన కార్యాలయాలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు కోదండాపురం ఎస్‌ఐ స్వాతి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని బీ వీరాపురం గ్రామ సమీపంలోని కృష్ణానది నుంచి ట్రాక్టర్ల ద్వారా మంగళవారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఈ క్రమంలో బీ వీరాపురం సమీపంలో పోలీసులు తనిఖీ చేసి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని పీఎస్‌కు తరలించి ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాధారణ కాన్పులకు ప్రాధాన్యం

కోడేరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇస్తారని డాక్టర్ దశరథం అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తప్పనిసరిగా సబ్‌సెంటర్ల వద్ద అందుబాటులో ఉండి సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా గర్భిణులు ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు అయ్యేలా చూడలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు.